కూటమి కుట్రకు డీలర్లు బలి

- బెదిరించి, దాడులు చేయించి రేషన్‌షాపులు సొంతం చేసుకుంటున్న టీడీపీ నాయకులు
- డీలర్‌షిప్ తొలగించారని మనస్తాపంతో గుండెపోటుతో మృతిచెందిన మాజీ డీలర్
- ప్రభుత్వం మారాక 5 నుంచి 6 సార్లు దాడి చేసి రేషన్ షాపు తొలగించిన వైనం


మాజీ డీలర్ యండ్రపాటి నరసింహారావు మృతదేహం

సంతనూతలపాడు: కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని రేషన్ షాపులను టార్గెట్ చేసి పాత రేషన్ డీలర్లను తొలగించి వారి స్థానంలో పచ్చ పార్టీ సానుభూతిపరులకు అప్పగించేందుకు దౌర్జన్యాలకు, బెదిరింపులకు దిగుతున్నారు. మూడు దశాబ్దాలుగా పర్మినెంట్ షాపులు నిర్వహిస్తున్న వారిని సైతం వెంటాడుతున్నారు. అనుకున్నదే తడవుగా సివిల్ సప్లై అధికారులను, రెవెన్యూ అధికారులను ఉసిగొలుపుతున్నారు. అధికార పార్టీ నేతలకు అధికారులు జీ హుజూర్ అంటూ అక్రమ కేసులు బనాయించడంలో తమ వంతు కీలక పాత్ర పోషిస్తున్నారు. రేషన్ పంపిణీ సమయంలో సివిల్ సప్లై డీటీలు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కాపు కాసి కేజీ, అరకేజీ రేషన్ సరుకులు తేడా వచ్చినా 6ఏ కేసులు బనాయిస్తూ వారిని తప్పిస్తున్నారు. ఇలా సంతనూతలపాడు మండలంలో 90 శాతం దుకాణాలను కూటమి నేతలు కబళించారు. ఈక్రమంలో కూటమి నేతల అరాచకానికి సంతనూతలపాడు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దళిత నేత, మాజీ రేషన్ డీలర్ యండ్రపాటి నరసింహారావు (64) బలయ్యారు. ప్రభుత్వం మారక వరుసగా ఐదారు సార్లు దాడులు చేసి ఆయనపై అక్రమ కేసు బనాయించి రేషన్‌షాపును తొలగించడంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం గుండెపోటు రావడంతో ఆయన్ను ఒంగోలు రిమ్స్‌లో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందారు. సొంత ఇల్లు కూడా లేని ఆయనకు రేషన్‌షాపే జీవనాధారం. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరసింహారావు మృతదేహానికి మంగళవారం సంతనూతలపాడులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, పలువురు దళిత నాయకులు నరసింహారావు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. దళిత వర్గానికి చెందిన రేషన్ డీలర్‌పై అక్రమ కేసులు బనాయించి తొలగించడం అన్యాయమని, ఆ మానసిక క్షోభతోనే నరసింహారావు చనిపోయాడని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎస్. సుబ్బారావు ఆరోపించారు.

అభివృద్ధిలో వేమా యల్లయ్యది చెరగని ముద్ర

- జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయింపు
- నివాళులర్పించిన బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి



వేమా యల్లయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి మండల అభివృద్ధిలో మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్య చెరగని ముద్ర వేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. చీమకుర్తిలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన వేమా యల్లయ్య నివాళుల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గాంధీనగర్, నెహ్రూనగర్, యల్లయ్యనగర్‌లలోనే పేదలకు దాదాపు 200 మందికిపైగా ఇంటి స్థలాలతో పాటు పక్కా గృహాలను వేమా యల్లయ్య మంజూరు చేయించారని గుర్తు చేశారు. దాంతో పాటు చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి, రామతీర్థంలోని పశువుల క్షేత్రం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను వేమా యల్లయ్య పాలనా కాలంలోనే చేశారన్నారు. 1978–83లో సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారని రాష్ట్రంలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు కేటాయించి తమ వంతు సహకారం అందించనున్నట్లు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి భరోసా ఇచ్చారు. బాలికల హాస్టల్‌కు నూతన భవన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి అనుకూలంగా ప్రస్తుతం ఉన్న బాలికలను బూచేపల్లి టీచర్ ట్రైనింగ్ కాలేజీలో నివాసం ఉండేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని హాస్టర్ వార్డెన్, బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న వేమా యల్లయ్య మెమోరియల్ భవన్ వద్ద ఉన్న వేమా యల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. వేమా యల్లయ్య నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బీరువాను అందించారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. కూనంనేనివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. వేమా యల్లయ్య కుమారుడు, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు సంతోషాన్ని కలిగించాయన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో తన తండ్రి వేమా యల్లయ్య చేసిన సేవలను స్థానిక ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉన్నాయన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, మాజీ జెడ్పీటీసీ గోగినేని వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, డాక్టర్ బీ.జవహర్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, కౌన్సిలర్‌లు చల్లా అంకులు, పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి, తప్పెట బాబూరావు, బడే అయ్యపరెడ్డి, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, గోపురపు చంద్ర, తెల్లమేకల గాంధీ, దుంపా యలమందారెడ్డి, మేకల యల్లయ్య, షేక్ ఖాదర్‌బాషా, చింతకింది అశోక్, యర్రగుంట్ల మోహన్, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య విద్య సంరక్షణపై అవగాహన పెంచుకోవాలి

- సీడీపీవో ఇవాంజిలిన్


అంగన్‌వాడీ వర్కర్ల కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఇవాంజిలిన్

మద్దిపాడు: బాల్య విద్య, సంరక్షణపై అవగాహన పెంచుకొని సెంటర్లకు వచ్చే చిన్నారులను తీర్చిదిద్దాలని సీడీపీవో ఇవాంజెలిన్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంగన్‌వాడీ వర్కర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెషన్ లో భాగంగా నవచేతన, ఆదర్శిల, ఈసీసీఈ పై పాలసీ పత్రాలు, బాల్య విద్య, సంరక్షణ అంగన్‌వాడీకి ముఖ్యమైనవని అన్నారు. శిక్షణ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్‌లు అందజేత

నాగులుప్పలపాడు: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎండ, వేడిమి నుంచి కాపాడాలన్న లక్ష్యంతో వారు పరీక్షలను మరింత మెరుగ్గా రాయడానికి ఉపయోగకరంగా ఉండేందుకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి సుబ్బయ్య తెలిపారు. ఉప్పుగుండూరు గ్రామంలోని 2 పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సోమవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

పొట్టు బండిని ఢీకొన్న కంటైనర్

- ఒకరికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: వ్యతిరేక దిశలో వస్తున్న పొట్టు బండిని కంటైనర్ ఢీకొన్న క్రమంలో డ్రైవర్ పక్కన కూర్చుని ఉన్న ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరికొందరు ప్రమాదం నుంచి తప్పించుకున్న ఘటన సోమవారం సాయంత్రం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం తాళ్లూరు మండలం శివరాంపురానికి చెందిన శ్రీనివాసరావు, మరికొందరు తమ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లుతో కలిసి రావినూతల వైపు నుంచి ట్రాక్టర్లో శనగ పొట్టు నింపుకొని గుండ్లాపల్లి సమీపంలో నుంచి వెల్లంపల్లి వైపు వ్యతిరేక దిశలో ట్రాక్టర్ నడుపుతుండగా చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ ఢీకొనడంతో ట్రాక్టర్ తిరగబడింది. ఈ క్రమంలో డ్రైవర్ పక్కన కూర్చున్న శ్రీనివాసరావు (48) తలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ తో పాటు మిగిలిన వ్యక్తులు పక్కకు దూకడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 ద్వారా క్షతగాత్రుని ఒంగోలు రిమ్స్ కు తరలించారు. శ్రీనివాసరావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

678 పొగాకు చెక్కుల విక్రయాలు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో ఒంగోలు-1 పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు ధర రూ.280 పలికింది. చిలంకూరు క్లస్టర్ పరిధిలో 815 బేళ్లను వేలానికి ఉంచగా, 678 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 137 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ కనిష్ఠ ధర రూ.250, సరాసరి ధర రూ.271.12 పలికింది. వేలంలో మొత్తం 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, వేలం నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

నిర్ణీత సమయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

ఒంగోలు టౌన్: నిర్ణీత సమయంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా ఫిర్యాదులను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుధాకర్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్యకు నివాళి

ఒంగోలు వన్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్యకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ యల్లయ్య ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన కాలంలో ఎస్సీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన అన్ని రకాల సబ్సిడీ రుణాలు అందించారన్నారు. భూమి కొనుగోలు పథకాన్ని అమలు చేశారన్నారు. చిట్టిమాల సంపత్‌కుమార్, చప్పిడి కోటేశ్వరరావు, సుదర్శి శ్రీను పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం

మద్దిపాడు: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి అందరం కృషి చేయాలని మద్దిపాడు ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ ఆనందమోహన్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం మద్దిపాడులో అవగాహన ర్యాలీ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆనంద్ మోహన్ సిబ్బందితో కలిసి 'టీ.బి. హారేగా దేశ్ జీతేగా' (టీ.బి.ఓడిపోతుంది దేశం గెలుస్తుంది) అనే నినాదంతో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ఎలా వస్తుంది దాని నివారణ మార్గాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీహెచ్. రజిత కుమారి మాట్లాడుతూ మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా కళ్లె పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని, ఎవరైనా అనుమానితులుంటే ఇక్కడికి వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. మద్దిపాడు టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ చంద్రమౌళి మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు నిక్షయ పోషణ యోజన కింద నెలకి రూ.1000 ప్రభుత్వం ద్వారా వ్యాధిగ్రస్తుల ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్స్ బాలకోటయ్య, సీతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఎంఎల్ హెచ్ పీలు, ల్యాబ్ సూపర్‌వైజర్ కిరణ్ కుమార్, శివరామకృష్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

సంతనూతలపాడు: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంలో భాగంగా సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలన పై ప్రజలకు అవగాహన కల్పించారు. సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పమిడి హరిణి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంత్ రెడ్డి, నాగరాజు, ఆరోగ్య శాఖ ప్రతినిధులు వెంకటేశ్వరరావు,ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ లు పాల్గొన్నారు.

శనగలు, మినుముల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

కొత్తపట్నం: రైతులు పండించిన శనగ, మినుములను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేసిందని ఏవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండలంలోని అల్లూరు రాజీవ్ కళా మందిర్‌లో రైతులకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో కనీస మద్దతు ధరకు శనగలు, మినుములు అమ్ముకోవాలని సూచించారు. శనగలు క్వింటా ధర రూ.5,650, మినుములు మద్దతు ధర రూ.7,400 నిర్ణయించి కొనుగోలు చేస్తున్నామన్నారు.

బాల్యం నుంచే సాంకేతిక విద్యను బోధించాలి

కొత్తపట్నం: బాల్యంలోనే గట్టి పునాదులు వేస్తే వారి జీవితంలో మంచి భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ ఆర్‌జేడీ జ్యోతిలక్ష్మి అన్నారు. పోషణ్ బీ పడాయి బీ (పిబిపిబి) కార్యక్రమాన్ని అల్లూరు హైస్కూల్లో నిర్వహించారు. సోమవారం కొత్తపట్నం, ఒంగోలు రూరల్ కలిపి 90 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని జ్యోతిలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసు నుంచే నాణ్యమైన విద్యను బోధిస్తే జీవితంలో స్థిరపడతారన్నారు. జాతీయ విద్యా విధానం ప్రకారం నాణ్యమైన విద్యలో మెళకువల కోసం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను కూడా అందించాలని కోరారు. పిల్లలను చిన్న వయసులోనే అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. నవచేతన కార్యక్రమం ద్వారా 0-3, 3-6 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆదర్శాల అనే కొత్త కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీడీపీవో రాజకుమారి, సూపర్‌వైజర్లు రాణి, ఆదిలక్ష్మి, అనూరాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి సహకరించండి

సంతనూతలపాడు: ప్రతి గ్రామంలో శానిటేషన్ పట్ల కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ పి.చక్రధరరావు పేర్కొన్నారు. సంతనూతలపాడులోని ఎస్.డబ్ల్యూపీసీ కేంద్రంలో మూడో రోజు శిక్షణలో భాగంగా సోమవారం చెత్త నుంచి సంపద తయారీపై నాగులుప్పలపాడు మండల స్థాయి కార్యదర్శులు, క్లాప్ మిత్రల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అనంతరం మాట్లాడారు. కార్యక్రమానికి సంతనూతలపాడు ఈవోపీఆర్డీ ఎం.రమణమ్మ అధ్యక్షత వహించగా, సంతనూతలపాడు మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్ పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, శానిటేషన్, స్ట్రీట్ లైట్స్ నిర్వహణ సీరియస్‌గా తీసుకోవాలని పేర్కొన్నారు. తడి చెత్త నుంచి వచ్చే కంపోస్ట్ సంపద ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యదర్శులు ఈ శిక్షణను సద్వినియోగపరుచుకోవాలని ఈఓపీఆర్డీ రమణమ్మ కోరారు. తడి చెత్త, పొడి చెత్తలను క్లాప్ మిత్రాలు సేకరించి ఎస్ డబ్ల్యూ పి.సి. కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీకి కృషి చేయాలని తెలిపారు. నేడు మద్దిపాడు మండలం కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు సంతనూతలపాడులోని చెత్త సంపద తయారీ కేంద్రంలో ఆయా కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా పి.చక్రధరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో నాగులుప్పలపాడు మండల కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

సంతనూతలపాడు: శిక్షణ తరగతుల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని రిసోర్స్ పర్సన్స్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లు పి.నాగలక్ష్మి, ఆర్.పి చ్చమ్మ కోరారు. సంతనూతలపాడు మండలం చిలకపాడు హైస్కూల్లో సోమవారం మండల స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. పోషణబి, పోషణ పడాయిలపై ఈ శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల్లో చిలకపాడు హైస్కూల్ ఉపాధ్యాయులు బీ హరిబాబు, పరాంకుశం మరుత్ కుమార్ ఆత్రేయ అంగన్‌వాడీ టీచర్లకు పలు రంగాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 26వ తేదీ వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. సంతనూతలపాడు, వేములపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి పాటుపడండి

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగపరుచుకొని వారి కేంద్రాల అభ్యున్నతికి పాటుపడాలని ఐసీడీఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయలక్ష్మి కోరారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట హైస్కూల్లో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ రమ అధ్యక్షత వహించారు. మూడు రోజుల పాటు పేర్నమిట్ట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ పడాయి, పోషణ బి పై శిక్షణ నిస్తున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఫణి రాజకుమారి, సూపర్‌వైజర్లు అనురాధ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిల్ నంబర్ ఆటగాళ్ల అరెస్టు

ఒంగోలు టౌన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో సింగిల్ నంబర్ ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసిన ఒన్‌టౌన్ పోలీసులు వారి నుంచి 5,500 రుపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలో ఎవరైనా సింగిల్ నంబర్ లాటరీలు కానీ, ఆన్‌లైన్ బెట్టింగులు కాని ఆడుతుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ నాగరాజు హెచ్చరించారు.

దళితుల భూమిని కబ్జా చేసేందుకు యత్నం

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఓ ప్రైవేటు కాలేజీ చైర్మన్ ఏవీ రమణారెడ్డి, ఆయన కుమారులు గణేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలు దళితుడు తాటిపర్తి వెంకయ్యకు చెందిన 0.40 సెంట్ల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ప్రజా సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం 1992ల వెంకయ్యకు డీకే పట్టా ఇచ్చిందని, 1996లో వెంకయ్య మరణించగా ఆయన్ను ఆ స్థలంలో ఖననం చేసి సమాధి నిర్మించినట్లు ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ తెలిపారు. ఇటీవల ఏకే బీఈడీ కాలేజీని కొనుగోలు చేసిన ఏవీ రమణారెడ్డి ఆ కాలేజీ ప్రహరీని ఆనుకొని ఉన్న సమాధిని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్య తీసుకోకపోవడం విచారకరమన్నారు. రాజకీయ అండదండలతో పోలీసులను ప్రభావం చేస్తున్నారని, కాలేజీపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, యరసం కన్వీనర్ పిన్నిక శ్రీనివాస్, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, జె.ఆంజనేయులు, గుంటూరు మస్తాన్‌రావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు

- ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి



ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు గణనీయంగా పెంపొందుతాయని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఏకేయూ సమావేశపు హాలులో వికసిత్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా జరిగిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఉప కులపతి ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు, ఉన్నత స్థాయి ఉద్యోగాల నియామకంలోనూ ఎంతగానో ఉపయోగ పడతాయని విద్యార్థులకు సూచించారు. ఏ వృత్తినైనా నిబద్ధతతో చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయని, అందుకోసం ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధిలో భాగంగా నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా గుణాన్ని, సేవాతత్పరతను పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రత్యేక ఆహ్వానితురాలుగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలామణి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా జట్టు సభ్యుల్లో ఐక్యం, సోదర భావం, సేవాగుణం వంటి మంచి లక్షణాలు అలవడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సోషల్ వర్క్ విభాగం హెడ్ డాక్టర్ పిల్లి వెంకటరావు, ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఎస్ఎస్ఎన్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.రాజేంద్ర, పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

చెవిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన భూమిరెడ్డి


చెవిరెడ్డితో భూమిరెడ్డి రమణమ్మ

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం భూమిరెడ్డి రమణమ్మ జనసేన పార్టీ మహిళలు తనపై దాడి చేసిన విషయాన్ని చెవిరెడ్డి భాస్కరరెడ్డితో చర్చించారు.

పేర్నమిట్ట సమస్యలు తీర్చాలంటూ ధర్నా


మునిసిపల్ అధికారులకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో వచ్చిన ప్రజల సమస్యలపై సోమవారం ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సంతనూతలపాడు మండల సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో గ్రామాల సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా పేర్నమిట్టలో పలు సమస్యలపై ప్రజలు సీపీఎం బృందానికి అర్జీలు సమర్పించారు. ఈ నేపథ్యంలో సమస్యలు పరిష్కరించాలంటూ ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు సీపీఎం పేర్నమిట్ట నాయకుడు అన్ను వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేర్నమిట్ట గ్రామం ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో చేరి నేటికి 13 ఏళ్లు దాటుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పేర్నమిట్ట చెరువులో 193 ఎకరాలను సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ గా మార్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, దానిని మెరుగుపరచాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, తక్షణమే సైడు కాలువలను నిర్మించాలని కోరారు. ముస్లింల శ్మశానంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. అనంతరం వారు ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, నగరపాలక సంస్థ ఇంజినీర్ చంద్రయ్యలకు సీపీఎం నాయకులు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, కాలేశా, కే రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శనీయుడు భగత్‌సింగ్

- భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా మంగమూరులో కాగడాల ప్రదర్శన


భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా కాగడా ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సంతనూతలపాడు: సర్దార్ భగత్‌సింగ్ యువతకు ఆదర్శనీయుడని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ అన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి మండలంలోని మంగమూరులో యువకులతో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని నిరుద్యోగ సమస్యపై, మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కే మధు, టి నవీన్, ఎస్ కే అఖిల్, జై ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు

మైనంపాడులో..

మండలంలోని మైనంపాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ల 94 వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో యువత నాయకుడు అల్లడి బాలాజి, సీపీఎం మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, ఏ భగత్ సింగ్, గుండవరపు సుబ్బారావు, కరిచేటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.